క్లుప్తంగా

వాసవీ శాంతి థాంలో కర్ణాటక భక్తుల పూజలు



పెనుగొండ వాసవీ శాంతి థాంలో హోమం నిర్వహిస్తున్న కర్ణాటక భక్తులు

పెనుగొండ: అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి థాంలో కర్ణాటక భక్తులు హోమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచి ఆలయంలో ఉదయం నుంచి కర్ణాటక రాష్ట్రం నుంచి వచ్చిన వాసవీ భక్తులు అమ్మవారికి పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం మరకత శిల వాసవీ మాతకు అభిషేకంలు నిర్వహించారు. అనంతరం వాసవీ హోమం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు.

ప్రతి ఇంటిపై కాషాయ జెండా



దొడ్డిపట్లలో కాషాయ జెండాలు పంచుతున్న భజరంగ్ దళ్ కార్యకర్తలు

యలమంచిలి: హిందువులంతా తమ ఇళ్లపై కాషాయ జెండాలు ఎగుర వేయాలని భజరంగ్ దళ్ కార్యకర్తలు కోరారు. దొడ్డిపట్లలోని విజయసారథి కాలనీలో భజరంగ్‌దళ్ కార్యకర్తలు సోమవారం ప్రతి ఇంటికీ కాషాయ జెండా పంచారు. ఈ సందర్భంగా గ్రామంలో నగర సంకీర్తన నిర్వహించారు. చిన్నారులతో భగవద్గీత శ్లోకాల ఆలపన చేయించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భజరంగ్‌దళ్ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల చంటి, మండల అధ్యక్షుడు దివి ప్రకాష్, ఉపాధ్యక్షుడు వినుకొండ శివ కార్యకర్తలు గుబ్బల బాబ్జీ, డి జగదీష్, గండికోట సుబ్బయ్య, చెరుకూరి శేషగిరి, విజయ సారథి కాలనీ వాసులు శేరు నాగబాబు, కామాడి శ్రీను, పెరికిపాలెం శ్రీను పాల్గొన్నారు.

వ్యక్తుల ప్రవర్తనలో మార్పులు గమనించాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ భారతి

పాలకొల్లు సెంట్రల్: కొన్ని సంఘటనలతో కుంగుబాటుకు గురైన వారు సహనాన్ని కోల్పోయి ఆత్మహత్యలకు పాల్పడుతుంటారని ప్రముఖ సైక్రియాటిస్ట్ డాక్టర్ చల్లా భారతి తెలిపారు. ఆదివారం ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక కోడిగట్టు వద్ద ఓ ప్రైవేటు ఆసుపత్రిలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ భారతి మాట్లాడుతూ ఆత్మహత్యలు చేసుకునే వారి ప్రవర్తనలో మార్పులను గుర్తించి సైక్రియాటిస్ట్‌ల సలహాలు తీసుకోవాలన్నారు. వారి సూచనల మేరకు మందులు వాడడంతో ఆత్మహత్యలు చేసుకోవాలనుకునే వారి ప్రవర్తనలో మార్పులు తీసుకురావచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చల్లా బ్రిజ్ మోహన్ కృష్ణ పాల్గొన్నారు.

కిరాణా షాపులో చోరీ

సాక్షి, భీమవరం: స్థానిక గునుపూడి నాచువారి సెంటర్‌లో వీరబాలాజీ కిరణా అండ్ జనరల్ స్టోర్స్‌లో రూ.మూడు వేల నగదు, రూ.2,500 విలువైన సిగరెట్లు చోరీకి గురైనట్టు యజమాని మురికిపూడి బాలాజీ తెలిపారు. ఆదివారం రాత్రి షాపు తాళాలు పగులగొట్టి దొంగతనానికి పాల్పడినట్టు బాలాజీ పేర్కొన్నారు. దీనిపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

భీమవరం అర్బన్: అదనపు కట్నం తీసుకురమ్మని వేధిస్తున్న భర్తపై భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నాగిడిపాలెం గ్రామానికి చెందిన కొల్లాటి జయదుర్గ, శ్రీనివాస్‌లకు 2017లో వివాహమైంది. అప్పట్లో జయదుర్గ తల్లిదండ్రులు శ్రీనివాస్‌కు పసుపు కుంకుమల కింద కొంత సొమ్ము ముట్టజెప్పారు. గత కొంతకాలంగా అదనపుకట్నం తీసుకురమ్మని శ్రీనివాస్ వేధిస్తుండటంతో జయదుర్గ ఫిర్యాదు మేరకు ఏఎస్సై డి.సంజీవరావు సోమవారం కేసు దర్యాప్తు చేపట్టారు.

వివాహిత ఫిర్యాదుపై కేసు నమోదు

భీమవరం అర్బన్: బంధువులు అన్యాయంగా కొట్టి గాయపరిచారని మహిళ ఫిర్యాదు మేరకు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. తుమ్మగొప్పి గ్రామానికి చెందిన బాలం సుజాత తమ బావలయిన బాలం బుజ్జిబాబు, బాలం చినబాబు ఆస్తి తగాదాలో అన్యాయంగా కొట్టి గాయపరిచారని బాలం సుజాత ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ పి.మహేశ్వరరావు కేసు దర్యాప్తు చేపట్టారు.

సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేయాలి

- ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి
- పాలకొల్లులో మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం
- రామాలయాల పునర్నిర్మాణానికి టీటీడీ నిధులు
- టీటీడీ బోర్డు మెంబర్ మేకా శేషబాబు

పాలకొల్లు అర్బన్: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి అన్నారు. వర్షాకాలంలో ప్రజలకు విద్యుత్, డ్రెయినేజీ, మంచినీరు, అలాగే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ సూచించారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జీఎంసీ బాలయోగి సమావేశ మందిరంలో ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. పూలపల్లి లేఅవుట్‌కి మండల పరిషత్ నుంచి సుమారు రూ.8లక్షలు నిధులు కేటాయిస్తామని, గ్రామ పంచాయతీ నుంచి మరో రూ.8 లక్షలు కేటాయించి కాలనీకి విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఎలక్ట్రికల్ అధికారులను ఎంపీపీ కోరారు. టీటీడీ బోర్డు మెంబర్ మేకా శేషబాబు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ద్వారా సంక్షేమ, అభివృద్ధి పనులకు సమాన ప్రాధాన్యత ఇచ్చారన్నారు. 9,216 మంది వృద్ధులకు పింఛన్లు అందజేసిన ఘనత సీఎంకి దక్కుతుందన్నారు. గ్రామాల్లో రామాలయాలు, భజన మండపాలు పునర్నిర్మాణానికి టీటీడీ నిధులు అందజేస్తుందన్నారు.

దిగమర్రు పంట కాలువ ప్రక్షాళన చేయకపోతే ఆమరణ దీక్ష చేస్తా

దిగమర్రు పంట కాలువలను ప్రక్షాళన చేయకపోతే తాను ఆమరణ దీక్ష చేస్తానని దిగమర్రు సర్పంచ్ రాపాక నగేష్ కరుణాకర్ హెచ్చరించారు. పట్టణంలోని రెండు ప్రధాన మురుగు డ్రెయిన్ల నీరు. 70 ఇళ్ల నుంచి వచ్చే సెప్టిక్ ట్యాంక్, ఇతర వ్యర్థాల నీరు కాలువలో పైపులు పెట్టి పంట నీరు కలుషితం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీని వల్ల 5 గ్రామాల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అనేక సమావేశాల్లో ఈ సమస్యను ప్రస్తావించినా మునిసిపల్ అధికారులు పట్టించుకోవడంలో సమావేశంలో అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసరావు వివరణ ఇస్తూ ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి సైతం తీసుకువెళ్లానని, నీటి కలుషితం వల్ల ప్రజలు అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉందని ఏఈ అంగీకరించారు. జెడ్పీటీసీ నడపన గోవిందరాజుల నాయుడు మాట్లాడుతూ గ్రామాల్లో ఎలక్ట్రికల్ సమస్యలు తక్షణం పరిష్కరించాలని సూచించడంతో ఏఈ సత్యనారాయణ వివరణ ఇస్తూ దిగమర్రు, నాగరాజుపేట, ఆగర్తిపాలెంలో విద్యుత్ సబ్‌స్టేషన్లు నిర్మాణంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లు, అలాగే 30, 40 ఏళ్ల క్రితం వేసిన విద్యుత్ లైన్లు పునఃనిర్మాణం తదితర మరమ్మతులకు రూ.8కోట్లు ప్రతిపాదించినట్లు చెప్పారు. లంకలకోడేరు నుంచి వెలివెల ఆర్అండ్‌బీ రోడ్డుకు రూ.3కోట్లు మంజూరై, టెండర్లు ఖరారయ్యాయని, త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు ఆర్అండ్‌బీ ఏఈ మూర్తి సమావేశం సభ్యుల దృష్టికి తీసుకువచ్చారు. జగనన్న ఆరోగ్య రక్ష సర్వేకి ప్రజాప్రతినిధులు సహకరించాలని ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు కోరారు.



మండల పరిషత్ సర్వ సభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి

టీడీపీ, జనసేన ఎంపీటీసీలు వాకౌట్

సమావేశం ప్రారంభమై అధికారులతో సమీక్ష జరుగుతుండగా మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అరెస్ట్‌ను నిరసిస్తూ వాకౌట్ చేస్తున్నట్లు ప్రతిపక్ష నేత శాగా సత్యనారాయణ ప్రకటించి సమావేశం నుంచి ఆయనతో పాటు టీడీపీ, జనసేన ఎంపీటీసీ సభ్యులు సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీలు పడవల సునీల్‌బాబు, యన్నాబత్తుల నాగేశ్వరరావు, ఎంపీటీసీ చింతపల్లి సాయిబాబా, సర్పంచ్‌లు కెల్లా సింహాచలం, విశ్వనాథం కనకభద్రం, ఎంపీడీవో సంగాని వెంకటేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

పాలకొల్లు అర్బన్: ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ యోజనలో భాగంగా లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య సలహాలు అందజేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహారం అందజేశారు. మెడికల్ ఆఫీసర్ డా.నవ్యజీవన్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పీహెచ్ఎన్ ఎలిజబెత్, హెల్త్ సూపర్‌వైజర్ అమలేశ్వరరావు, కమల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంగ, ఏఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో 'నా మట్టి నా దేశం'

పాలకొల్లు సెంట్రల్: స్థానిక బ్రాడీపేట ప్రాంతంలో నా మట్టి నా దేశం కార్యక్రమంలో భాగంగా సోమవారం మట్టి సేకరణ కార్యక్రమం నిర్వహించినట్టు జిల్లా బీజేపీ ఓబీసీ అధ్యక్షుడు గుడాల ఈశ్వర్ ఈశ్వర్ అన్నారు. ప్రతి గ్రామం నుంచి పవిత్రమైన మట్టిని సేకరించి మండల కేంద్రాల నుంచి ఢిల్లీకి పంపించేందుకు రాష్ట్ర, జిల్లా పార్టీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కొల్లి నరసింహమూర్తి, రావూరి సుధ, పట్టణ అధ్యక్షుడు జక్కంపూడి కుమార్, సెక్రటరీ కొల్లి కొండ ప్రసాద్, కొణిజేటి గుప్త తదితరులు పాల్గొన్నారు.

ఈ- క్రాప్ నమోదు తప్పనిసరి

యలమంచిలి: రైతులు తాము సాగు చేసిన పంట వివరాలను ఈ-క్రాప్ యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి కోరారు. యలమంచిలిలో ఈ క్రాప్ నమోదు కార్యక్రమాన్ని సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యలమంచిలి మండలంలో ఈ సార్వా పంటకు 4,262 మంది రైతులు 5,322 ఎకరాల్లో వరి సాగు చేశారన్నారు. ఇంతవరకు 4,020 ఎకరాలకు సంబంధించి 2,967 రైతులు మాత్రమే ఈ క్రాప్‌లో వివరాలు నమోదు చేసుకున్నట్లు ఆమె వివరించారు. ఈ క్రాప్ నమోదయ్యాక ఈకేవైసీ ప్రారంభించాల్సి ఉంటుందన్నారు. పంటల బీమా, నష్ట పరిహారం, గిట్టుబాటు ధర, సున్నా వడ్డీ, బ్యాంకు రుణాలు, ఎరువులు, పురుగు మందులు సరఫర, వైఎస్సార్ యంత్ర పరికరం నమోదు, పెట్టుబడి సాయం మంజూరు, ఉచిత బోర్లు మంజూరు వంటి ప్రయోజనాలు పొందాలంటే రైతులు తప్పనిసరిగా ఈ నెల 15వ తేదీ లోపు ఈ క్రాప్‌లో తమ పంట వివరాలను నమోదు చేసుకోవాలని ఆమె కోరారు. ఈ-క్రాప్‌లో భాగంగా రైతు భరోసా కేంద్రాల వద్ద గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రతి రైతు భూమి, గ్రామం, సర్వే నెంబరు, ఆధార్, పంట వివరం, నాట్లు వేసిన తేదీ వివరాలు నమోదు చేసి ఆన్‌లైన్ చేస్తారని, దీంతో పంట అమ్మే సమయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ సులభతరమవుతుందని ఆమె చెప్పారు.



యలమంచిలిలో ఈ- క్రాప్ నమోదును పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి

వరి పొలంలో కాలిబాటలతో అధిక లాభం

- అధిక దిగుబడికి దోహదం
- చీడపీడల సమస్య నివారణ

యలమంచిలి: వరి చేను ఊడ్చిన తరువాత పొలంలో ప్రతి రెండు మీటర్లకు కాలిబాట వేయడం వల్ల రైతులకు అధిక ప్రయోజనం ఉంటుంది. పైరు వేరు భాగానికి విస్తారంగా గాలి, సూర్యరశ్మి తగలడం, చీడ, పీడల సమస్య తగ్గడం, ఎరువులు, పురుగు మందులు చల్లే సమయంలో దారి సమస్య తగ్గడం తోపాటు ప్రతి ఎకరాకు మూడు, నాలుగు బస్తాలు అదనంగా పండి రైతులకు లాభాన్ని కలగజేస్తుంది. గతంలో చాలామంది రైతులు కాలిబాటలు వేయడం అదనపు ఖర్చుగా భావించి ఆసక్తి కనపరచే వారు కాదు. వ్యవసాయాధికారులు కాలిబాటల ప్రయోజనాన్ని రైతులకు విస్తృతంగా వివరించడంతో ఇప్పుడు రైతులంతా కాలిబాటలు వేస్తున్నారు.

కాలిబాటలు వేసే విధానం

కాలిబాటలు వేసే సమయంలో రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలి. ప్లాస్టిక్ లేదా డొక్కతాడు తీసుకుని చేను గట్టు అవతలి వైపు నుంచి ఇవతలి వైపు వరకు బాగా సాగదీసి కట్టాలి. తాడు వెంబడి 12 సెంటీమీటర్లు వెడల్పున వరి నాట్లు తొలగించి పక్కనే పలుచగా ఉన్న ప్రదేశంలో నాటుకోవాలి. వెదజల్లే పద్ధతిలో సాగు చేస్తే విత్తనాలు చల్లిన తరువాత 15 నుంచి 20 రోజుల వ్యవధిలో కాలిబాటలు వేసుకోవాలి.



యలమంచిలి మండలం శిరగాలపల్లిలో కాలిబాటలు వేసిన వరి చేను

ప్రయోజనాలెన్నో..

కాలిబాట వేయడం వల్ల పైరు మొదళ్లకు గాలి, వెలుతురు, సూర్యరశ్మి విస్తారంగా తగులుతుంది. దీంతో పైరు ఆరోగ్యంగా ఎదుగుతుంది.

- చీడపీడల బెడద కొంతవరకు తగ్గుతుంది. కాలిబాట మార్గంలో వెళ్లి కలుపు తొలగించడానికి, మందులు చల్లడానికి వీలు కలుగుతుంది. తెగుళ్లను సులభంగా గుర్తించడానికి, సస్యరక్షణ చర్యలు తీసుకోవడానికి ఎలుకలను నివారణకు వీలవుతుంది. తుపాన్లు, భారీ వర్షాలు వంటి ప్రకృత్తి విపత్తులు ఏర్పడిన సమయంలో పైరులో కిరణజన్య సంయోగ క్రియ సమర్థవంతంగా జరిగి దిగుబడి తగ్గకుండా ఉంటుంది. పైరులో చీడ పీడల ఉధృతిని దగ్గరగా గమనించి, దానికి అనుగుణంగా సకాలంలో సస్యరక్షణ చర్యలు తీసుకోవడానికి వీలవుతుంది.

దిగుబడి పెరుగుతుంది



ఒక ఎకరం పొలంలో కాలిబాటలు వేయడానికి సుమారు రూ.800 ఖర్చవుతుంది. కాని కాలిబాటలు వేయడం వల్ల నాలుగు బస్తాల వరకు అధిక దిగుబడి రావడమే కాకుండా పంట కాలంలో చేను మొత్తం తిరగడానికి అనువుగా ఉంటుంది. దీనిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పుడు రైతులంతా కాలిబాటలు వేస్తున్నారు.

– చిందులూరి దేవి, యలమంచిలి మండల వ్యవసాయాధికారి

ప్రత్యేక అలంకరణలో క్షీరారామలింగేశ్వరస్వామి

పాలకొల్లు సెంట్రల్/పాలకొల్లు అర్బన్: పంచారామక్షేత్రం క్షీరారామలింగేశ్వరస్వామిని టీటీడీ బోర్డు సభ్యుడు మేకా శేషబాబు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం ఆలయానికి విచ్చేసిన శేషబాబు- శశికళ దంపతులను ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం గణపతి, క్షీరారామలింగేశ్వరస్వామి, జనార్ధనస్వామి, లక్ష్మీ పార్వతి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద ఆశీర్వచనం చేసి స్వామివారి శేష వస్త్రం, ఫొటో, తీర్థప్రసాదాలు అందజేశారు. సోమవారం క్షీరారామలింగేశ్వరస్వామికి ఉదయం నుంచి అభిషేకాలు, అర్చనలు చేశారు. రాత్రి స్వామివారికి పంచహారతులు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఈవో యాళ్ల సూర్యనారాయణ, జోగి వెంకటేశ్వరరావు, జోగి వడ్డికాసులు, పెచ్చెట్టి కోటేశ్వరరావు, మోర్త గిరీష్, గవర బుజ్జి, ఆలయ సిబ్బంది, ట్రస్ట్‌బోర్డు సభ్యులు పాల్గొన్నారు.



టీటీడీ బోర్డు సభ్యుడు శేషబాబును సత్కరిస్తున్న ఆలయ ఛైర్మన్, ఈవోలు

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో అనాథ మృతదేహానికి సోమవారం అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. ఐదు రోజుల క్రితం స్థానిక బస్టాండ్ సమీపంలో రోడ్డు పక్కన మృతి చెందిన గుర్తుతెలియని పురుషుని మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు మార్చురీకి తరలించారు. ఈ మృతదేహం కోసం ఎవరూ రాకపోవడంతో సమాచారం తెలుసుకున్న అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ముందుకు వచ్చి హిందూ సాంప్రదాయ ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. ట్రస్ట్ నిర్వాహకులు అంబటి సాయి మాట్లాడుతూ ఎవరూ లేని అనాథలకు తమ ట్రస్ట్ తరపున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గతంలో కూడా ఓ అనాథ మృతదేహానికి, చనిపోయిన గోవుకు అంత్యక్రియలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు తోట దుర్గాప్రసాద్, అనంతపల్లి సతీష్, కవురు యశ్వంత్, షేక్ సిద్దిక్ పాల్గొన్నారు.



అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న అమ్మ ట్రస్ట్ సభ్యులు

జేసీఎస్ పట్టణ కన్వీనర్-2గా గిరీష్

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులను సమన్వయం చేసుకుని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) కోరారు. పాలకొల్లు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పట్టణ సచివాలయ కన్వీనర్-2గా మోర్త గిరీష్‌ను నియమించినట్టు గోపి ప్రకటించారు. గిరీష్‌కు పుష్పగుచ్ఛం అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. పట్టణ సచివాలయ కన్వీనర్ ఎంఎస్ వాసు, పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు, పార్టీ నాయకులు మద్దా చంద్రకళ తదితరులు గిరీష్‌ను ప్రత్యేకంగా అభినందించారు.



పాలకొల్లు పట్టణ జేసీఎస్ కన్వీనర్-2 మోర్త గిరీష్‌ను అభినందిస్తున్న గుడాల శ్రీహరి గోపాలరావు

నరసాపురంలో కుండపోత వర్షం

నరసాపురం రూరల్: నరసాపురం పట్టణంలో సోమవారం వేకుజాము నుంచి భారీ వర్షం కురిసింది. కుండపోత వర్షానికి రోడ్లు, డ్రైన్లు, ఏకమయ్యాయి. ఉధృతంగా రోడ్లపై వర్షపు నీరు ప్రవహించడంతో రోడ్లు కాలువల్లా దర్శనమిచ్చాయి. పట్టణంలోని పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. కుంభ వృష్టికి జనజీవనానికి అంతరాయం కలిగింది. మధ్యాహ్నం వరకూ వర్షం పడుతూనే ఉంది. ఈ స్థాయిలో వర్షం కురిసిన సందర్భాలు కొన్నేళ్లుగా లేవని స్థానికులు అన్నారు. పట్టణంలో అన్ని చోట్ల మురుగు డ్రెయిన్లు ఉప్పొంగి పోయాయి. భవిష్యత్తులో డ్రెయిన్ల స్థాయిని పెంచుకోవాలని ఈ వర్షం హెచ్చరిక చేసినట్లుగా అనిపించింది. ఇటీవల వర్షాలు లేక వ్యవసాయ రంగం ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితుల్లో ఒక్కసారిగా కురిసిన భారీ వర్షంతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. వాతావరణం చల్లబడి వరి పైరుకు అనువైన పరిస్థితి ఏర్పడటంతో మేలు చేకూరుతుందని రైతులు ఆనందపడుతున్నారు. రొయ్యల చెరువులకు ఆక్సిజన్ లోపం వల్ల కొంత నష్టం చేకూరుతుందని ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు.



జలమయమైన నరసాపురం ప్రధాన రహదారి



కాళీపట్నం వద్ద జాతీయ రహదారిపై వర్షం నీరు

మొగల్తూరులో భారీ వర్షం

మొగల్తూరు: వర్షాకాలం ప్రారంభమైన తరువాత మొదటి సారిగా మండలంలో భారీ వర్షం కురిసింది. గత రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు సుమారు 32.2 మిల్లీమీటర్ల వర్ష పాతం నమోదైంది. ఆగకుండా వర్షం కురవడంతో జాతీయ రహదారితో పాటు గ్రామాల్లోని పలు రహదారులు నీటమునిగాయి. జాతీయ రహదారిపై కాళీపట్నం వద్ద మోకాలు లోతున నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మొగల్తూరులోని గాంధీ బొమ్మల సెంటర్, స్టేషన్ రోడ్డు, గొల్లగూడెం, మసీదు సెంటర్, కెపిపాలెంలో ఉన్నత పాఠశాల ప్రాంతంలోను, పేరుపాలెం నాలుగురోడ్ల సెంటర్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో స్థానికులతో పాటు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

స్పందనలో 3 ఫిర్యాదులు

ఆకివీడు: స్పందన కార్యక్రమంలో మూడు ఫిర్యాదులు అందినట్టు ఎంపీడీఓ కందుల వాణి సోమవారం చెప్పారు. ఆయా సమస్యలపై సంబంధిత అధికారులకు ఫిర్యాదుల్ని పరిశీలన నిమిత్తం పంపినట్లు తెలిపారు.

13న ఫిట్టర్స్‌కు జాబ్‌మేళా

ఉండి: స్థానిక ఎన్నార్పీ అగ్రహారం ప్రభుత్వ ఐటీఐలో ఫిట్టర్ ట్రేడులో ఉత్తీర్ణులైన వారికి ఈ నెల 13న ఉదయం 10 గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ఐటీఐ జిల్లా కన్వీనర్ వి.శ్రీనివాసరాజు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ఫిట్టర్ ఉత్తీర్ణులైన వారుహాజరుకావాలని కోరారు.

బంద్ విఫలం

మొగల్తూరు/పెనుగొండ/నరసాపురం రూరల్ : చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా టీడీపీ ఇచ్చిన పిలుపుమేరకు సోమవారం చేపట్టిన బంద్ విఫలమైంది. బంద్ ప్రభావం ఎక్కడా కనపడలేదు. మొగల్తూరులో ప్రధాన వ్యాపార కూడలైన గాంధీ బొమ్మల సెంటర్‌లో దుకాణాలు యథావిధిగా తెరుచుకున్నాయి. బస్సులు, ఆటోలు ఒక గంట సేపు ఆపినా తిరిగి యథావిధిగా ప్రయాణించాయి. పెనుగొండలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఆచంట కూడలిలో ధర్నా నిర్వహించిన టీడీపీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.నరసాపురంలో వైసీపీ ప్రాబల్యం ఎక్కువగా ఉండటంతో బంద్ ప్రభావం కనిపించలేదు.విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు యథావిధిగా పనిచేశాయి.



మొగల్తూరులో యథావిధిగా తెరుచుకున్న దుకాణాలు

బయటపడ్డ బాబు అవినీతి బండారం



స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు బండారం బయటపడింది. అన్నారు. సాక్ష్యాధారాలున్నందునే కోర్టు చంద్రబాబుకు 14 రోజుల జ్యూడీషియల్ రిమాండ్ విధించింది. బాబు కుమారుడు లోకేశ్ కంటే జనసేన నాయకుడు పవన్ హడావుడి ఎక్కువగా కనిపిస్తోంది. బాబు తప్పు చేసాడని కోర్టులు నమ్ముతుంటే పవన్ మాత్రం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై ఆరోపణలు చేయడం ఎంత వరకు న్యాయమని రవికుమార్ ప్రశ్నించారు.

– కొల్లాబత్తుల రవికుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్, మొగల్తూరు

టీడీపీ పతనం మొదలైంది



చంద్రబాబు అవినీతి చిట్టా ఒక్కొక్కటీ బయటపడుతోంది., దీంతో తెలుగు దేశం పార్టీ పతనం మొదలయ్యింది. రాష్ట్రంలో బంద్‌ను ఎవరూ పాటించలేదు. చివరకు చంద్రబాబు సొంత సంస్థ హెరిటేజ్ సైతం మూత పడలేదు. చంద్రబాబు జైలుకి వెళితే ఎల్లో బ్యాచ్ విలవిల్లాడుతోంది. స్టేలు తెచ్చుకొని పబ్బం గడుపుకుంటున్న చంద్రబాబుకు పాపం పండింది. కేసుల్లో శిక్షలు పడడం ఖాయం. దీంతో ఎన్టీఆర్ ఆత్మకు పూర్తిస్థాయిలో శాంతి కలుగుతుందన్నారు.

– కొప్పూరి వేణుమాధవ రెడ్డి, విద్య, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరక్టర్

అవినీతి అనకొండ చంద్రబాబు



అవినీతిలో అనకొండగా మారి ప్రజాధనాన్ని కొల్లగొట్టిన మాజీ సీఎం చంద్రబాబు ఎట్టకేలకు స్కిల్ డవలప్‌మెంట్ స్కామ్‌లో సీఐడీ అధికారులకు అడ్డంగా దొరికి జైలు పాలు కావడం సబబే. 27 కేసుల్లో స్టేలు తెచ్చుకున్న ఘనుడాయన. రాష్ట్ర రాజకీయ చరిత్రలో అవినీతి కేసులో జైలు పాలైన మాజీ సీఎం చంద్రబాబునాయుడు చరిత్రపుటల్లో నిలిచిపోతారు. ప్రభుత్వ శాఖలన్నిటిలోనూ పెద్ద ఎత్తున దోపిడీ చేశారు. త్వరలో మరిన్ని స్కామ్‌లు వెలుగు చూస్తాయి.

– కుంచిలపల్లి వినిస్టన్‌బాబు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు